కథల పుస్తకం తిరగవేశాను. 'త్రిశూలి' అనే పేరు చూశాను.

"అమ్మా! ఈ త్రిశూలి అన్నతను ఎవరో తెలుసున న్నావు. ఎవరో చెప్పవూ?"

అమ్మ పెద్దగా నిట్టూర్చి- "అవునమ్మా తెలుసు!" అన్నది.

అమ్మ అలా నిట్టూర్చడంలో ఏదో గొప్ప అంతరార్థం ఇమిడి ఉంటుందని మాత్రం గ్రహించాను.

"అయితే ఎవరో చెప్పవే అమ్మా!" అని చిన్నపిల్లకి మల్లే మారాము చేశాను.

"అతను మరెవరో కాదమ్మా! నీ అక్క మొగుడు...బావే!" అన్నది అమ్మ.

నేను చాలా ఆశ్చర్యపోయాను! మా తల్లి దండ్రులకు నేనొక్కర్తినే కూతుర్ననుకుంటు న్నాను ఇన్నాళ్లూ.


కళ్లు పెద్దవి చేసి- "అయితే అమ్మా! నాకెప్పుడూ ఒక అక్కయ్యుంటూ ఉన్నదని చెప్పలేదేం? అక్కయ్యెవరో, త్రిశూలి ఎవరో విపులంగా చెప్పవే!" అని ప్రాధేయ పడ్డాను.

"అలాంటి అక్క లభించడం భాగ్యమో కాదో కాని, త్రిశూలి బావగారి వంటి మహో న్నత వ్యక్తి లభించడం మహాభాగ్యమే [illegible]

నేమో, కంటినుండి అశ్రువులు కనబడ కుండా, చీరచెంగు కళ్లకి అడ్డం పెట్టింది అమ్మ. ఒక్కక్షణం ఆగి-"ఈ రోజుల్లో రచ యితలు ఆదర్శాలు వల్లిస్తూ రాస్తారేకాని, చేతలు చెయ్యలేరు. చేతల్లో అమలుచేసిన ఘనత మీ త్రిశూలి బావగారికే దక్కింది" అన్నదమ్మ.

★ ★ ★

గార్డు ఈల ఊది జెండా ఊపాడు. రైలు కదిలింది.




"మరి నేనుంటాను కళా! జాగ్రత్తగా వెళ్లు. రెండ్రోజులు పోయేక నేనొచ్చి కలుస్తాలే!" అని వీడ్కోలు చెప్పాడు అర్ధాంగికి భర్త చిన్నసూరి.

"సెలవ్! మీ ఆరోగ్యం జాగ్రత్త" అంది కళావతి.

కళావతిని చిన్నసూరి రైలెక్కించాడు, ప్రక్క స్టేషనే అయిన పుట్టింటికి. వీళ్లిద్దరూ నెల్లాళ్లక్రిందటే దంపతులయ్యారు. వివా హం అయిన వెంటనే కాపురానికి వచ్చింది కళావతి. భర్త చిన్నసూరి ఈ చిన్న స్టేషన్‌లో అసిస్టెంటు స్టేషన్ మాస్టరు. నెలరోజులు కాపురం చేసేక పుట్టింటివాళ్లని చూడాలని ఉందంటే కళావతిని రైలెక్కించాడు. ప్రక్క స్టేషనే కాబట్టి, తోడు అనవసరం అని, తాను వెళ్లిపోగలనని కళావతి అనడంవల్ల, ఆమె ఒక్కర్తినీ రైలెక్కించాడు చిన్నసూరి.

"ఏంబాబూ! అమ్మగారిని పుట్టింటికి పంపించేరా?" అడిగాడు కళాసీ ఒకడు.

"ఔనోయ్! నెల్లాళ్లయిందోలేదో ఓ మాటు తల్లిదండ్రుల్ని చూడాలని ఉందిట" అని చిరునవ్వుతో అన్నాడు చిన్నసూరి— "ఏమిటో ఈ ఆడవాళ్ల తత్త్వం. నెలరోజులు అమ్మనీ నాన్ననీ చూడకుండా ఉండలేనం టారు. ప్రక్కనే పదిహేను కి.మీ. దూరంలో వున్న పుట్టింటి వాళ్లని చూడ్డం కాకపో తుందా? చాదస్తం కాకపోతే!"

"దగ్గరగా పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉండబట్టే అమ్మగారు వాళ్లని చూడ్డానికి బయలుదేరారు. దూరంగా ఉంటే ఎప్పుడోగాని రావడం అవదుకదు బాబూ!" అన్నాడు కళాసీ.

చిన్నసూరి చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

"అయితే బాబూ! అమ్మగారి పక్కన తెల్లగా ఉంగరాల జుట్టు గలాయన కూచున్నారే -ఆయన మీ బావమరిదిగారా బాబూ? అమ్మగార్ని తీసుకెళ్లడానికి వొచ్చినట్టున్నారు" అన్నాడు కళాసీ.

చిన్నసూరి కొంచెం ఆలోచించాడు. ఇదేమిటీ? తను కళావతి ఒక్కర్తినే రైలెక్కిం చాడే! వీడేమిటి ఇలా అంటున్నాడు?

ఇటీవల ఎన్నికలలో ఓడిపోయిన రాజకీ యవేత్త మొహంలాగ అయింది చిన్నసూరి మొహం.

"నువ్వు పొరపాటు పడి ఉంటావోయ్ వీరన్నా! దిగేది పక్క స్టేషనే కదా అని ఆమె ఒక్కర్తినే బండి ఎక్కించానోయ్, నాకు అసలు బావమరదులే లేరోయ్" అన్నాడు చిన్నసూరి.

"లేదు బాబూ! నేను బాగా చూశానే? ఎవరో ఉంగరాల జుట్టు గలాయన అమ్మ గారి పక్కనే కూర్చున్నారు బాబూ! తెల్లగా ఉంటారు" అన్నాడు వీరన్న.

"బండిలో అమ్మగారొక్కర్తే కూర్చోవా లని ఎక్కడుందోయ్. జనం అనేకులుం

టారు. జాగా లేకపోతే మరో పాసింజరెవ రైనా ఈమె పక్కని కూర్చొని ఉండొచ్చు. దానికేముంది?" అన్నాడు చిన్నసూరి.

"కాదు బాబూ! అమ్మగారూ ఆయనా కులాసాగా నవ్వుకుంటూ మాట్లాడుకుంటు న్నారు" అని తనపని తను చూసుకుంది కిపోయాడు వీరన్న.

చిన్నసూరి ఏమీ మాట్లాడలేక దిగులు పడిపోయాడు. రైళ్లు రకరకాల రూట్లలో పరుగెడుతున్నట్టు -తన మనస్సు రకర కాల రూట్లలో పొడుగెడుతోంది! రైళ్లకు బ్రేకులైనా ఉన్నాయికాని, మనస్సుకు బ్రేకుల్లేవు!

తెల్లని వ్యక్తి! ఉంగరాల జుత్తు! ఎవడు వాడు? వీరన్న బాగా చూశానంటు న్నాడే!

చిన్నసూరి ప్రక్క స్టేషన్‌కి ఫోనుచేశాడు.

"రమేష్ ! నేను చిన్నసూరిని మాట్లాడు తున్నాను. ఇప్పుడు ఫోర్‌పార్టీలో మా మిస్సెస్ కళావతిగాని దిగుతుందేమో చూడు. ఒకవేళ దిగితే సరేసరి. లేకపోతే మా అత్తగారింటికి ఎవర్నైనా పంపించి తెలుసుకుని చెప్పు".

అరగంట గడిచేక రమేష్ ఫోనులో సమాధానం చెప్పాడు.

"సారీ చిన్నసూరీ ! ఆమె వాళ్లమ్మ గారింటికి రాలేదట".

చిన్నసూరి గాబరాపడ్డాడు! వెంటనే తరువాత ట్రయినులో బయలుదేరాడు చిర్రుబుర్రులాడుతూ. అత్తా మామల్ని కలిసి చీవాట్లు పెట్టాడు! వాళ్లు జరిగి దంతా దాచకుండా చెప్పక తప్పింది కాదు.

"ఎంతపని చేశారు! పదండి, ప్రేమా పురం వెళదాం" అన్నాడు చిన్నసూరి.

అంతా ప్రేమాపురం చేరారు.

చిన్నసూరి, కళావతితో నెమ్మదిగా మాట్లాడసాగాడు.


"చూడమ్మాయ్ కళావతీ! నువ్వు రాజాగార్ని ప్రేమిస్తున్నప్పుడు వేరే కులం అని చూడక, మీ వాళ్లు ఆయన కిచ్చే పెళ్లి చేయవలసింది. నువ్వాగట్టి గానే ప్రతిఘటించావ్ ప్రేమించిన యువ కుని మోసం చేయలేక! అది నాకు నచ్చింది.

-కాని, కళా! నువ్వు చేసిన ఈ పని ఏమీ బావులేదనడానికి నేనెందుకు సాహసిస్తు న్నానంటే- నాతో పెళ్లి కాకముందే ఈ పని చేయవలసింది నువ్వు.

-ఇంతకీ అమ్మాయ్! బలవంతం పెళ్లిళ్లు చేసెయ్యడానికి ఇవి వెనుకటి రోజులు కావాయె! పోనీ, నీకు రాజునితప్ప ఇతరులె వరినీ వివాహం చేసుకుందికి ఇష్టం లేద నుకో, అయినప్పుడు ఆ విషయం వారితో నిష్కర్షగా చెప్పవలసింది. అలా చెప్పినా



ప్రయోజనం లేకపోయిందనే అనుకో. నిన్ను చూడ్డానికి నేను వచ్చినప్పుడు "అయ్యా! మీరు నన్ను ఇబ్బందిపెట్టి ఏమీ లాభంలేదు. నేను ఫలానా రాజుగారిని ప్రేమించాను. నా పరిస్థితి ఇది" అని మనం ప్రయివేటుగా మాట్లాడినప్పుడు



మొహమాటం లేకుండా చెప్పవలసింది. పోనీ పెద్దవాళ్లని చూసి భయపడ్డానని అంటావేమో? నా అంతటనేను—'కళావతి గారూ! మీరు నాకు నచ్చారు. మిమ్మల్ని పెళ్లి చేసుకుందికి నాకెటువంటి అభ్యంతర మూలేదు. నా పరిస్థితులు ఇవి. నా జీతం ఐదువేలు. ఈ మొత్తంలో మీరు సంసారం పొదుపుగాచేసి, ఆదర్శ నారి అనిపించుకో వాలి. జాగ్రత్తగా ఆలోచించండి. నన్ను పెళ్లి చేసుకుందికి మీకు ఇష్టం ఉన్నదీలేనిదీ చెప్పండి. ఇది ఒక్కనాటి ముచ్చటకాదు. జీవితపు ప్రశ్న. ఏ మాత్రం ఒడిదుడుకు లున్నా సంసారనౌక మునిగిపోతుంది' అని మీ సమ్మతిని తెల్పడానికి రెండ్రోజులు గడువు కూడా ఇచ్చాను. అయినా మీరిలా ప్రవర్తించడం సమంజసంగా లేదు. ఎందు కలా మీతో చెప్పానంటే, మీ కొకవేళ ఇంకొకరిపై మనస్సున్నా, లేక ఇంకే ఇతర కారణాలవల్లనైనా పెళ్లి చేసుకోవడం ఇష్టం లేకపోయినా —నేనిలా అడగడం మీకెంత గానో ఉపకరిస్తుంది. కాని అంతా తారు మారు చేసేశారు.

—ఇప్పుడు చూడండి. నా శ్రేయోభిలా షులూ బంధుగణమూ ఇది తెలుసుకుని నన్నేమంటారో?

'హల్లో బ్రదర్! దాంపత్యం సాఫీగా సాగు తోందా? వేగం ప్రోగ్రెస్ కనబరచు'.

'ఒరేయ్ అబ్బాయ్! ఓసారి మీరుభ యులూ వచ్చి మాతో సరదాగా రెండ్రోజు లుపాటు గడపండి' అని ఆహ్వానించే అభినందించే బంధువులకీ స్నేహితు లకీ ఏం జవాబు చెప్పను?" ఉస్సురు మని నిట్టూర్చాడు చిన్నసూరి.

"మిస్టర్ రాజూ! మీరు నాకొక హామీ ఇవ్వాలి!" అని పక్కనే కూచున్న రాజు చేతులు పట్టుకున్నాడు చిన్న సూరి. "కళావతి మిమ్మల్ని నమ్ము కుని మీతో వచ్చేసింది. ఆమెను మీరు సుఖపెట్టి సుఖపడండి. ఆమెతో మీరు ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్నైనా ఎదు ర్కొని ధైర్యంగా జీవితం సుగమం చేసుకోండి. ఇది నా ప్రార్థన.

-ఒక తుమ్మెద ఒక పువ్వులోని మక రందాన్ని గ్రోలి, మరో పువ్వు మీదకు పోతుంది.

- మీరు మాత్రం తుమ్మెదకిమల్లే సంచరించరని నా దృఢవిశ్వాసం.

చిన్నసూరి ఒక క్షణం ఆగి - "అమ్మాయీ కళావతీ! నాకు సెలవి ప్పించు. అయ్యా! రాజాగారూ! నమ స్కారం" అని కళావతి తల్లిదండ్రుల్ని వెంటబెట్టుకుని గమ్యస్థానం చేరాడు.

★ ★ ★

"ఆ చిన్నమూరేనమ్మాయ్, ఈ 'త్రిశూలి' అనే కలం పేరుతో కథలు రాస్తుంటాడు. నువ్వింకా అప్పటికి చిన్నపిల్లవి" అని కంట తడిపెట్టింది అమ్మ.

వాకూ కన్నీళ్ళు ఆగలేదు...